# 61. అస్ సఫ్ ( శ్రేణి ) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 14 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ మార్గంలో త్యాగనిరతి, ధనప్రాణాలతో త్యాగానికి సిద్ధపడడం, క్రమశిక్షణ, సమైక్యత, యుద్ధ రంగంలో ధైర్యసాహసాల గురించి ఈ సూరా ప్రధానంగా ప్రస్తావించింది. ఇందులోని 4వ ఆయతులో వచ్చిన 'శ్రేణి' (సఫ్) అన్న ప్రస్తావనను ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. అల్లాహ్ మార్గంలో పోరాడాలని, చెక్కుచెదరని పంక్తులుగా, దృఢసంకల్పంతో నిలబడి పోరాడాలని, తమ విశ్వాసాన్ని ఆచరణలో చూపించాలని బోధించింది. ప్రవక్త మూసా(అస), ఈసా(అస)ల కథలను ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఊరట ఇవ్వడానికి ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) జాతి ప్రజలు, అంటే ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఆయనకు బాధ కలిగేలా, ఆగ్రహం కలిగేలా వ్యవహరించారు. వారికి ఆయన దేవుని సందేశహరుడని తెలిసినా కూడా అలా వ్యవహరించారు. ఈసా(అస)కు కూడా ఇస్రాయీల్ సంతతి ప్రజలు బాధ కలిగించారు. ఆయన దైవప్రవక్త అన్న విషయం కూడా వారికి తెలుసు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దేవుడు పంపించిన దైవప్రవక్త, అల్లాహ్ ఆయనకు మార్గదర్శ కత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి యావత్తు మానవాళి కొరకు పంపించాడని ఈ సూరా నొక్కి చెప్పింది. అవిశ్వాసులకు ఇష్టం లేకపోయినా గాని అల్లాహ్ తన ధర్మాన్ని పరిపూర్ణం చేస్తాడనీ, వ్యాపింపచేస్తాడని చెప్పడం జరిగింది.

# 61. అస్సఫ్[1] సూరా

# سُوْرَةُ الصَّفِّ

అవతరణ : మదీనా ఆయతులు : 14

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతున్నది. ఆయన సర్వశక్తుడు, వివేకవంతుడు.

سَبَّحَ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ①

**2** ఓ విశ్వాసులారా! మీరు చేయ(లే)ని దాన్ని గురించి ఎందుకు చెబుతారు?[2]

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لِمَ تَقُوْلُوْنَ مَا لَا تَفْعَلُوْنَ ②

**3** మీరు చేయని దాన్ని గురించి చెప్పటం అల్లాహ్ సమక్షంలో ఎంతో సహించ రానిది.[3]

كَبُرَ مَقْتًا عِنْدَ اللّٰهِ اَنْ تَقُوْلُوْا مَا لَا تَفْعَلُوْنَ ③

**4** అల్లాహ్ ప్రేమించేది సీసం పోసి నిర్మిం పబడిన గోడలాగా వరుసతీరి స్థిరంగా అతని మార్గంలో పోరాడేవారినే[4] సుమా!

اِنَّ اللّٰهَ يُحِبُّ الَّذِيْنَ يُقَاتِلُوْنَ فِيْ سَبِيْلِهٖ صَفًّا كَاَنَّهُمْ بُنْيَانٌ مَّرْصُوْصٌ ④

1. మహాప్రవక్త సహచరులు కొంతమంది ఒకచోట కూర్చొని, 'దేవునికి ఇష్టమైన పని ఏది? అదేదో తెలిస్తే మేము తప్పకుండా చేసేవారమే! అదేదో దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకోవాలి' అని చెప్పుకుంటున్నారు. కాని ఆ మాట దైవప్రవక్త (స)ను అడగటానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ సూరా అవతరించింది (ముస్నదె అహ్మద్ – 5/452; సుననె తిర్మిజీ – అస్సఫ్ సూరా వ్యాఖ్యానం).
2. ఈ వాక్యంలో హెచ్చరిక ఉంది. వట్టిమాటల వల్ల ప్రయోజనం ఏమీ లేదు. ఆచరణ ముఖ్యం. దేవునికి ప్రియమైన పనేదో తెలిస్తే తప్పకుండా చేస్తామని గొప్పలు చెప్పుకుని, తీరా ఆ పనేదో తెలుపబడిన తరువాత చతికిలబడటం సహించరాని విషయం. అందుకే చేయలేని దాన్ని గురించి నోటితో ఎందుకు చెప్పుకుంటారు? ఆడిన మాటను ఎందుకు నిలుపుకోరు? అని ప్రశ్నించటం జరిగింది.
3. ఈ విధంగా మాటలకు – చేతలకు మధ్య వైరుధ్యం కనబరచే వారిని దేవుడు అసహ్యించుకుంటాడు. అలాంటి వారు ఒక్కోసారి దైవాగ్రహానికి కూడా గురి కావలసి వస్తుంది.
4. ఇంతకీ అల్లాహ్‌కు ఎంతో ప్రియమైన పనేమిటో తెలుసుకోవాలనుకుంటున్నారా!? అదే దైవమార్గంలో పోరాడటం.

**5** మూసా తన జాతివారితో, “ఓ నా జాతి ప్రజలారా! నేను మీ వద్దకు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తనన్న సంగతి తెలిసి కూడా మీరు నన్నెందుకు ఇంతగా వేధిస్తున్నారు?”[5] అని చెప్పినప్పటి విషయం (జ్ఞాపకం చేసుకోదగినది). వారు వక్రంగానే ఉండటంతో, అల్లాహ్ వారి హృదయాలు వంకరగానే ఉండేలా చేశాడు.[6] అవిధేయ జనులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

وَإِذْ قَالَ مُوسٰى لِقَوْمِهٖ يٰقَوْمِ لِمَ تُؤْذُوْنَنِيْ وَقَدْ تَّعْلَمُوْنَ أَنِّيْ
رَسُوْلُ اللّٰهِ إِلَيْكُمْ فَلَمَّا زَاغُوْٓا أَزَاغَ اللّٰهُ قُلُوْبَهُمْ وَاللّٰهُ لَا يَهْدِي
الْقَوْمَ الْفٰسِقِيْنَ ۝٥

**6** మర్యమ్ కుమారుడైన ఈసా, “ఓ ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీ వైపు అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను.[7] నా తరువాత రాబోయే

وَإِذْ قَالَ عِيْسَى ابْنُ مَرْيَمَ يٰبَنِيْٓ إِسْرَآءِيْلَ إِنِّيْ رَسُوْلُ اللّٰهِ إِلَيْكُمْ
مُّصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيَّ مِنَ التَّوْرٰىةِ وَمُبَشِّرًاۢ بِرَسُوْلٍ يَّأْتِيْ

5. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) దేవుని తరఫు నుండి పంపబడిన సత్యవంతుడైన ప్రవక్త అని తెలిసి కూడా ఇస్రాయీల్ జనులు ఆయన్ని వేధించేవారు. అనరాని మాటలు అని మనస్తాపం కలిగించేవారు. ఆయన శరీరావయవాల్లో లోపం ఉందని పుకార్లు పుట్టించేవారు. నిజానికి అలాంటి లోపం ఏదీ ఆయనలో లేదు.

6. అంటే విషయం తెలిసిన తరువాత కూడా విముఖులైపోయారు. సత్యం బదులు అసత్యాన్ని, మేలుకు బదులు కీడును, విశ్వాసానికి బదులు అవిశ్వాసాన్ని అవలంబించారు. అందువల్ల వారికి తగిన శాస్తిగా అల్లాహ్ వారిని శాశ్వతంగా వక్ర మనస్కులుగా చేసేశాడు. మనిషి అపమార్గం, అసత్యాలపై పాతుకుపోయినప్పుడు అతని హృదయ కవాటాలపై మూతపడిపోతుంది. తరువాత అవిధేయత, తిరస్కార భావం, హింస అతని నైజంగా మారిపోతాయి. ఇక అటువంటి వాణ్ణి మార్చటం ఎవరితరమూ కాదు. అందుకే “అల్లాహ్ అవిధేయులకు మార్గదర్శకత్వం వహించడు” అని ఈ సందర్భంగా చెప్పటం జరిగింది. ఎందుకంటే దేవుడు తన సంప్రదాయాన్ననుసరించి ఇలాంటి వారిని అపమార్గాన వదిలేసి ఉంటాడు. స్వయంగా దేవుడే మార్గ భ్రష్టుణ్ణి చేసిన వారికి ఇక సన్మార్గం ఎవరు చూపగల్గుతారు?

7. ఇక్కడ దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం) సంగతి కూడా ఎందుకు ప్రస్తావించ బడిందంటే ఇస్రాయీల్ వంశీయులు మూసాను ఎదిరించినట్లే ఈసాను కూడా

مِنْ بَعْدِى اسْمُهٗٓ اَحْمَدُ ۚ فَلَمَّا جَآءَهُمْ بِالْبَيِّنٰتِ قَالُوْا هٰذَا سِحْرٌ مُّبِيْنٌ ۞٦

ఒక ప్రవక్తను గురించి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు అహ్మద్"[8] అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించ దగినదే). తీరా అతను స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చినప్పుడు, "ఇది పచ్చి ఇంద్రజాలం"[9] అని వారు అన్నారు (తేలిగ్గా కొట్టి పారేశారు).

ఎదిరించారు. ఈ వాక్యం ద్వారా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటం జరిగింది– "ఓ ముహమ్మద్ (స)! ఈ యూదులు నీ పట్లనే కాదు, లోగడ కూడా వారు ప్రవక్తలను ఎంతగానో బాధించారు. అసలు వాళ్ల చరిత్ర ఆసాంతం ప్రవక్తల ధిక్కరణతో నిండి ఉన్నది."

తౌరాతు గ్రంథాన్ని ధృవీకరించటంలోని భావం ఏమిటంటే, నేను ఈనాడు మీకు ఏ సందేశం అందజేస్తున్నానో తౌరాతు సందేశం కూడా అదే. అంటే నాకు పూర్వం తౌరాతు గ్రంథం తెచ్చిన ప్రవక్త (మూసా)అయినా, బైబిలు గ్రంథాన్ని తెచ్చిన నేను (ఈసా) అయినా – మేమిద్దరం చెప్పేది ఒకే మాట. మేమిద్దరం నడిచేది ఒకే బాట. అందుచేత మీరు మూసా, హారూను, దావూదు, సులైమాను ప్రవక్తలను నమ్మి నడుచుకున్నట్లే నన్ను కూడా నమ్మి నడవండి. ఎందుకంటే నేను తౌరాతును సత్యమని ధృవీకరిస్తున్నాను. ఆ గ్రంథాన్ని త్రోసిపుచ్చటం లేదు.

8. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) తరువాత రాబోయే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గురించి ఈ ఆయతులో శుభవార్త ఇవ్వబడింది. అందుకే ముహమ్మద్ (సఅసం) వారు ఇలా చెబుతుండేవారు : "నేను నా పితామహుడైన ఇబ్రాహీము ప్రార్థనాఫలాన్ని. ఈసా (ఏసుక్రీస్తు) శుభవార్తకు ప్రతీకని" (ఐసరుత్త ఫాసీర్). ఇక **'అహ్మద్'** ( اَحْمَدُ ) అనే పదానికి రెండు అర్థాలు వస్తాయి. ఒకటి : జనులందరిలోకెల్లా ఎక్కువగా దైవస్తోత్రం చేసేవాడు. రెండు : తన లోని సుగుణాల రీత్యా అందరికన్నా ఎక్కువగా ప్రశంసించబడినవాడు (ఫత్హుల్ ఖదీర్).

9. అంటే దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) సమర్పించిన నిదర్శనాలను వారు మాంత్రికవిద్యగా కొట్టిపారేశారు. అంతకుముందు గతించిన అనేక జాతుల వారు కూడా ఇలాగే వ్యవహరించారు.

**7** ఇస్లామ్ వైపు తనను ఆహ్వానించబడు తున్నప్పటికీ[10] అల్లాహ్‌పై అబద్ధపు నిందలను కల్పించేవాడికంటే పరమ దుర్మార్గుడెవడుంటాడు[11] ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.

وَمَنْ أَظْلَمُ مِمَّنِ افْتَرَىٰ عَلَى اللَّهِ الْكَذِبَ وَهُوَ يُدْعَىٰ إِلَى الْإِسْلَامِ ۚ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ ﴿٧﴾

**8** వారు అల్లాహ్ జ్యోతిని తమ నోళ్ళతో ఊది ఆర్పివేయదలుస్తున్నారు.[12] అయితే అల్లాహ్ మాత్రం తన జ్యోతిని పరిపూర్ణంగావిస్తాడు[13] – అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనాసరే!

يُرِيدُونَ لِيُطْفِئُوا نُورَ اللَّهِ بِأَفْوَاهِهِمْ وَاللَّهُ مُتِمُّ نُورِهِ وَلَوْ كَرِهَ الْكَافِرُونَ ﴿٨﴾

**9** ఆయనే తన ప్రవక్తకు సన్మార్గాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చిపంపాడు – దాన్ని మత ధర్మాలన్నింటిపై ఆధిక్యం వహించేలా

هُوَ الَّذِي أَرْسَلَ رَسُولَهُ بِالْهُدَىٰ وَدِينِ الْحَقِّ لِيُظْهِرَهُ عَلَى الدِّينِ

---

మరి కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)కు వర్తిస్తుందని చెప్పారు. అట్టి పరిస్థితిలో 'ఇది మాంత్రిక విద్య' అని చెప్పినవారు మక్కా వారవుతారు.

10. ఈ ధర్మం (ఇస్లాం) ఉన్నతమైనది. అటువంటి ధర్మం వైపు పిలువబడే వ్యక్తి అల్లాహ్‌కు అబద్ధాలు ఆపాదించటం అనేది ఊహించరానిది. ఒకవేళ ఎవరయినా అలాచేస్తే అది దుర్మార్గానికి పరాకాష్ఠే!

11. ఇంతకీ ఆ అబద్ధపు నిందలు ఏవై ఉంటాయి? అంటే ఉదాహరణకు: అల్లాహ్‌కు సంతానాన్ని ఆపాదించటం, ఆయన నిషేధించని పశువులను నిషిద్ధమని ప్రజలకు నమ్మబలకటం.

12. ఇక్కడ జ్యోతి (నూర్) అంటే దివ్య ఖుర్‌ఆనూ కావచ్చు, ఇస్లాం ధర్మమూ కావచ్చు, ముహమ్మద్ (స) ప్రవక్త కూడా కావచ్చు లేక దేవుని నిదర్శనాలు కూడా కావచ్చు. 'నోటితో ఊదటం' అంటే వారు తమ నోటితో పలికే ఎత్తిపొడుపు మాటలు, అనుచిత వ్యాఖ్యలు అని అర్థం.

13. అంటే ఈ సత్యధర్మాన్ని యావత్ప్రపంచంలో విస్తరింపజేస్తాడు. లేక ఈ ధర్మానికి ఇతర మతాలపై స్పష్టమైన ఆధిక్యతను ఇస్తాడు. ఈ ఆధిక్యత భౌతికంగానూ కావచ్చు, ప్రమాణాల నిదర్శనాల దృష్ట్యా కూడా కావచ్చు.

كُلِّهِۦ وَلَوْ كَرِهَ ٱلْمُشْرِكُونَ ٩

చేయటానికి![14] ఈ విషయం బహుదైవా రాధకులకు ఇష్టంలేకపోయినా సరే.[15]

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ هَلْ أَدُلُّكُمْ عَلَىٰ تِجَٰرَةٍ تُنجِيكُم مِّنْ عَذَابٍ أَلِيمٍ ١٠

**10** ఓ విశ్వాసులారా! మిమ్మల్ని వ్యధా భరితమైన శిక్ష నుండి రక్షించే వర్తక మేదో[16] నేను మీకు తెలుపనా?

تُؤْمِنُونَ بِٱللَّهِ وَرَسُولِهِۦ وَتُجَٰهِدُونَ فِى سَبِيلِ ٱللَّهِ بِأَمْوَٰلِكُمْ
وَأَنفُسِكُمْ ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ إِن كُنتُمْ تَعْلَمُونَ ١١

**11** మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ మార్గంలో మీ ధన ప్రాణాలొడ్డి పోరాడండి. మీరు గనక తెలుసుకోగలిగితే ఇది మీకు ఎంతో మేలైనది.

يَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ وَيُدْخِلْكُمْ جَنَّٰتٍ تَجْرِى مِن تَحْتِهَا ٱلْأَنْهَٰرُ
وَمَسَٰكِنَ طَيِّبَةً فِى جَنَّٰتِ عَدْنٍ ذَٰلِكَ ٱلْفَوْزُ ٱلْعَظِيمُ ١٢

**12** అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ)వనా లలో మీకు ప్రవేశం కల్పిస్తాడు. శాశ్వ తంగా ఉండే ఉద్యానవనాలలో గల పరిశుభ్రమైన గృహాలలో ప్రవేశింప జేస్తాడు. నిజానికి ఇదే గొప్ప సాఫల్యం.

وَأُخْرَىٰ تُحِبُّونَهَا نَصْرٌ مِّنَ ٱللَّهِ وَفَتْحٌ قَرِيبٌ وَبَشِّرِ ٱلْمُؤْمِنِينَ ١٣

**13** మీరెంతగానో ఇష్టపడే మరొకటి (అనుగ్రహం) కూడా వొసగుతాడు. అది అల్లాహ్ సహాయం, శీఘ్ర విజయం![17]

14. ఇంతకుముందు చెప్పిన విషయమే ఇది. దీనికున్న ప్రాముఖ్యత దృష్ట్యా ఇది మరోసారి పునరావృతం అయింది.

15. ఏది ఏమైనా సరే దైవనిర్ణయానికి తిరుగు ఉండదు.

16. విశ్వాసాన్ని, దైవమార్గంలో పోరాటాన్ని ఇక్కడ లాభసాటి వ్యాపారంగా అభివర్ణించటం గమనార్హ విషయం. ఇంతకీ ఆ లాభం ఏమిటి? అంటే అది స్వర్గ ప్రవేశం! నరక యాతన నుండి రక్షణ!! ఇంతకన్నా గొప్ప లాభం ఇంకేముంటుంది? ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ప్రాణాలను, వారి సంపదలను స్వర్గానికి బదులుగా కొనుగోలు చేశాడు." (తౌబా – 111).

17. అంటే – మీరు ఆయన మార్గంలో పోరాడినప్పుడు, ఆయన ధర్మానికి సహాయ పడినప్పుడు ఆయన కూడా మీకు తోడ్పడతాడు. మీకు విజయం చేకూరుస్తాడు. ఈ

(ఓ ప్రవక్తా!) విశ్వాసులకు దీని గురించి శుభవార్తను వినిపించు.[18]

14 ఓ విశ్వాసులారా! మర్యమ్ కుమారుడైన ఈసా తన హవారీలతో, "అల్లాహ్ మార్గంలో నాకు సహాయపడగల వారెవరు?" అని అన్నపుడు, "అల్లాహ్ మార్గంలో మేము సహాయపడతాము"[19] అని హవారీలు సమాధాన మిచ్చినట్లు మీరు కూడా అల్లాహ్‌కు సహాయకులు అవండి.[20] తరువాత ఇస్రాయీలు

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ كُونُوٓا۟ أَنصَارَ ٱللَّهِ كَمَا قَالَ عِيسَى ٱبْنُ مَرْيَمَ لِلْحَوَارِيِّـۧنَ مَنْ أَنصَارِىٓ إِلَى ٱللَّهِ ۖ قَالَ ٱلْحَوَارِيُّونَ نَحْنُ أَنصَارُ

సంగతిని ఆయన మరోచోట ఈ విధంగా తెలిపాడు : 1. "మీరు గనక దైవానికి తోడ్పడితే, ఆయన మీకు తోడ్పడతాడు. మీ పాదాలకు నిలకడను, స్థయిర్యాన్ని ఇస్తాడు." (ముహమ్మద్ – 7). 2. "ఎవరయినా అల్లాహ్‌కు సాయం చేస్తే అల్లాహ్ కూడా వారికి తప్పకుండా సాయపడతాడు. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప శక్తిమంతుడు, ఆధిపత్యం కలవాడు." (అల్ హజ్ – 40). **'శీఘ్ర విజయం'** అంటే మక్కా విజయమని కొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం ఇది రోములపై, పారశీకులపై ముస్లింలకు లభించిన విజయం. 'ఖిలాఫతె రాషిదా' కాలంలో ముస్లింలను ఈ విజయం వరించింది.

18. అంటే – మరణానంతరం స్వర్గం ఖాయం అన్న సంతోషవార్తను, ప్రాపంచిక జీవితంలో కూడా ఇతరులపై విజయం లభిస్తుందన్న శుభవార్తను వినిపించు. కాకపోతే విశ్వాసులు విశ్వాసం వాంఛించే విధ్యుక్త ధర్మాలను నెరవేర్చాలి.

"మీరు గనక నికార్సయిన విశ్వాసులైతే అవిశ్వాసులపై మీరే పైచేయిగా ఉంటారు." (ఆలి ఇమ్రాన్ : 139).

19. మహాప్రవక్త (సఅసం) వారు కూడా హజ్ కాలంలో ప్రజలనుద్దేశించి, "నాకు ఆశ్రయమిచ్చే వారెవరు? మీరు గనక నాకు సహాయపడితే నేను దైవదాసులకు దైవసందేశం అందజేస్తాను. ఎందుకంటే ఖురైషులు ఈ కర్తవ్య నిర్వహణలో అడ్డు తగులుతున్నారు" అని ప్రకటించేవారు. ఆయన (స) గారి ఈ పిలుపుపై మదీనాకు చెందిన ఔస్ ఖజ్రజ్ తెగలవారు ముందుకు వచ్చారు. వారు ఆయన (స) చేతిలో చెయ్యేసి ఆయన (స)కు సాయపడతామని వాగ్దానం చేశారు. మహాప్రవక్త (స)గనక మక్కానుండి మదీనాకు వలస వస్తే అన్ని విధాలా సహాయం చేస్తామని కూడా మాటిచ్చారు. ఇచ్చిన మాటను నిలుపుకున్నారు కూడా. మహాప్రవక్త (స) మరియు

اللّٰهِ فَاٰمَنَتْ طَّآئِفَةٌ مِّنْۢ بَنِیْۤ اِسْرَآءِیْلَ وَكَفَرَتْ طَّآئِفَةٌ ۚ
فَاَيَّدْنَا الَّذِيْنَ اٰمَنُوْا عَلٰى عَدُوِّهِمْ فَاَصْبَحُوْا ظٰهِرِيْنَ ۝١٤

సంతతివారిలో ఒక వర్గం వారు విశ్వసించగా, మరొక వర్గం వారు తిరస్కరించారు.[21] అప్పుడు మేము విశ్వసించిన వారికి వారి శత్రువులకు వ్యతిరేకంగా తోడ్పడ్డాము. తత్ఫలితంగా వారు గెలుపొందారు.[22]

ఆయన సహచరులు మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసినపుడు వారు అందించిన తోడ్పాటు అపురూపమైనది. వారి ఈ సేవలకు చిహ్నంగా దేవుడు, దైవప్రవక్త (స) వారిని **'అన్సార్లు'** (సహాయకులు) అని పిలిచారు. దేవుడు వారితో ప్రసన్నుడగుగాక! (ఇబ్నె కసీర్).

20. ఎల్లవేళలా మనస్ఫూర్తిగా దైవమార్గంలో తోడ్పడండి. మీ మాటల ద్వారా, చేతల ద్వారా కూడా సహాయపడండి. మీ సిరిసంపదల ద్వారా, మీ ప్రాణాల ద్వారా కూడా తోడ్పడండి. దైవప్రవక్త మిమ్మల్ని ఏ ఘడియలో పిలిచినా తక్షణం హాజరు పలకండి. పూర్వం దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) పిలుపుపై హవారీలు స్పందించినట్లుగానే మీరు కూడా సకారాత్మకంగా స్పందించండి.

21. తిరస్కరించిన వారు యూదులు. వారు దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు)ను కేవలం తిరస్కరించటంతోనే ఆగలేదు. ఆయన తల్లి మర్యమ్‌పై అభాండం కూడా మోపారు.

మరి కొంతమంది ప్రకారం దైవప్రవక్త ఈసా (అలైహిస్సలాం)ను దేవుడు ఆకాశం పైకి తీసుకున్నప్పుడు అనుయాయుల మధ్య విభేదం పొడసూపింది (చీలిక వచ్చింది). ఈసా రూపంలో దేవుడే భువిపై ప్రభవించాడనీ, ఇప్పుడాయన ఆకాశం పైకి వెళ్ళిపోయాడని ఒక వర్గం వాదించింది. ఇది 'యాఖూబియా' వర్గం అనబడుతుంది. ఈసా (ఏసు) దేవుని కుమారుడని, తండ్రి తన కుమారుణ్ణి గగనానికి పిలుచుకున్నాడని 'నస్తూరియా' వర్గం వాదించింది. ఈసా (ఏసు) దేవుని దాసుడనీ, దేవుని ప్రవక్త అని మూడో వర్గం వాదించింది. మూడవ వర్గం వాదనే సరైనది.

22. అంటే మేము అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను ప్రభవింపజేసి, మిథ్యావాదులకు విరుద్ధంగా వారిలోని చివరి వర్గానికి సాయం చేశాము. క్రైస్తవుల్లోని ఈ మూడవ వర్గం మహాప్రవక్త (స)ను కూడా విశ్వసించింది. వారి దగ్గరున్న సత్యబలం కారణంగా మేము వారికి ఇతర అవిశ్వాసులపై కూడా ఆధిక్యతను వొసగాము. ప్రళయదినానికి ముందు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) భువిపైకి దిగివచ్చినప్పుడు ఈ ఆధిక్యత మరింతగా స్పష్టమవుతుంది. హదీసులలో ఈ విషయం చాలా వివరంగా ఉంది.